


# మార్కెట్ యుద్ధం

ముదిగంటి సుజాతారెడ్డి

కథ

**ఎన్నో ఏండ్లుగా మార్కెట్‌ను తన గుప్పిట్లో పెట్టుకున్న 'కాల్‌మాల్' టూత్‌పేస్టు అమ్మకాలు క్రమక్రమంగా పడిపోవటం కల్లోలాన్ని సృష్టించింది. నష్టాల్లో నడుస్తున్నది. కాల్‌మాల్ సరుకంతా దుకాణాల్లో పేరుకపోతున్నది. కాల్‌మాల్ సరుకు కావల్సినంత డిమాండు తగ్గట్లుగా అందటంలేదని ఇంతకుముందు హోల్‌సేల్ వ్యాపారుల నుంచి ఫోన్లు వచ్చేయి. ఇప్పుడు ఉల్టా అయింది. సరుకు ఇప్పుడే పంపకండి అంటూ ఫోన్లు!**

కాల్‌మాల్ షేర్లు కావాలని ఆరాటపడే జనం ఇప్పుడు కాల్‌మాల్ షేర్లు అంటె వద్దంటున్నారు. మార్కెట్లో కాల్‌మాల్ షేర్లు కూలిపోతున్నాయి. కాల్‌మాల్ ఎమ్‌డి తల పట్టుకున్నాడు. ముప్పై ఏండ్ల నుంచి మార్కెట్‌ను ఏలుతున్న కాల్‌మాల్ ఈ విధంగా కావటమేంది! డాక్టర్లకు కావాల్సినంత డబ్బు ఇచ్చి కొనుక్కొని పేషంట్లకు కాల్‌మాల్ వాడండి అని చెప్పించాం! ఇప్పుడు డాక్టర్లు చెప్పినా పేషంట్లు కాల్‌మాల్ కొనటం లేదు. కారణమేంది? లవంగమని ఉప్పు అనీ కాల్షియమ్ అనీ ఏ టూత్‌పేస్టు వాళ్ళూ తయారుచేయని రకరకాల కాంబినేషన్లు కాల్‌మాల్‌లో వున్నాయి. అన్నిటికీ గిరాకీ వుండేది! సంవత్సరానికో కొత్త రకాన్ని మార్కెట్లోకి వదులుతూంటె కస్టమర్లు పడిపడి కొంటూనే వున్నారు! ఎన్నడూ ఏ సంక్షోభం రాలేదు! హఠాత్తుగా ఈ కల్లోలం ఏంది! ప్రకటనల విషయంలో ఏ లోటు లేకుండా అడ్వర్‌టైజింగ్ శాఖ చూస్తూనే వుంది. మధ్య మధ్య పెద్ద పెద్ద హీరో హీరోయిన్లతో ప్రకటనలను తయారు చేస్తూనే వున్నారు. మరి ఎక్కడ జరిగింది లోపం. కాల్‌మాల్ ఆదాయంలో అరవైశాతం ప్రకటనల ఖర్చుకే పోతున్నది! కస్టమర్లు పెట్టే ధరలో అరవై శాతం ప్రకటనల ఖర్చును భరిస్తున్నారు! లోపలి మాయాజాలం తెలియక కస్టమర్లు ధరకేం జంకలేదు. మంచి వస్తువుకు మంచి ధర చెల్లిస్తున్నామని తృప్తిపడ్డారు. కాల్‌మాల్‌ను కొంటూనే వున్నారు! అనుకోకుండా ఈ దెబ్బ ఏంది? కాల్‌మాల్ ట్యూబ్ అందంలోగాని డబ్బా అందంలోగాని ఏం లోపం లేదు! మరెందుకు కాల్‌మాల్ గిరాకి కూలిపోతున్నది!

ఎమ్‌డి సుందరం చూపులు ప్రొడక్షన్ సెక్షన్ మీద నిలిచాయి. అక్కడ్నుంచి కదలటం లేదు. చచ్చాంరా!- అని కోటును సర్దుకున్నాడు. ప్రొడక్షన్ సెక్షన్ బాస్ సక్వేరా. తను ఏదో ఒకటి జవాబు చెప్పాలి! తడబడ్డాడు సెక్వేరా. అయినా గట్టిగా ఊపిరి తిత్తుల్లోకి గాలి పీల్చుకొని-

"మిస్టర్ సుందరం! మా డిపార్ట్‌మెంటులో ఏం లోపం లేదు. ప్రతిఒక్కరం అప్రమత్తంగానే పనిచేస్తున్నాం. దట్ ఐ క్యాన్ అష్యూర్ యూ!" అన్నాడు కొద్దిగా భుజాలెగరేస్తూ.

ఎమ్‌డి మార్కెటింగ్ సెక్షన్‌వైపు చూసాడు తీక్షణంగా. దాని హెడ్ గోయల్ చాల ఆత్మవిశ్వాసంతో కన్పించాడు. తన ఎడమ చేత్తో కుడి చెవిని పట్టుకొని లాగాడు కాస్త. ఆయన నోరు విప్పి మాట్లాడేముందు అట్లా చేయటం అలవాటే.

"మిస్టర్ సుందరం! మార్కెటింగ్‌లో మేమేం లోపం చేయలేదు. మా అడ్వర్‌టెయిజంగ్ శాఖలోనూ ఏం లోపం లేదు. ఈ మధ్య మన అడ్వర్‌టెయిజ్‌మెంటు ఫిల్మ్ బాగుందని అవార్డు కూడా ఇచ్చారు బిజినెస్ న్యూస్ పత్రికవారు."

వెంటనే ఎమ్‌డి చూపులు వాడిగా గోయల్‌ను దూసుకపోయాయి.

"మిస్టర్! గోయల్! మీరు మార్కెటింగ్ సర్వే చేయించండి. సేల్స్ పడిపోవటానికి కారణాలేమిటో సేల్‌డాటా ఏమిటో రెండు రోజుల్లో నా టేబిల్ మీదుండాలి!" గర్జించాడు ఎమ్.డి.


ఈసారి ఎమ్‌డి చూపులు క్వాలిటీ సెక్షన్ మీద పడ్డాయి. ఆ సెక్షన్ హెడ్ అగర్వాల్ లేచి నిలబడ్డాడు.

"సర్! క్వాలిటీలో లోపంగాని పరిశోధనలో లోపంగాని

ఏమాత్రం లేదు. ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తూనే వున్నాం. దట్ మచ్ ఐ క్యాన్ అష్యూర్ యూ సర్!" అన్నాడు.

మీటింగ్ తర్వాత ఎవరి ఆత్మపరిశోధనలో వాళ్ళు పడ్డారు. మార్కెట్ సేల్స్ పడిపోయాయంటే తమ ఉద్యోగాలు ఊడినట్లే! రోడ్డు మీద పడి అడ్డుక్కోవాల్సిన పరిస్థితులు వస్తాయి. ఎవరికివారే గజగజ వణికిపోతున్నారు- "మా నాన్న ఆఫీసులో గుమాస్తా పనిచేసేవాడు. అది గవర్నమెంటు ఉద్యోగం. ఇరవై ఏండ్ల వయస్సులో ఉద్యోగంలో చేరాడు. నెల నెలా జీతం తీసుకుంటూ హాయిగా పెండ్లి చేసుకొని పిల్లల్ని కంటూ ఏ చీకూ చింత లేకుండా హాయిగా రిటైర్ అయ్యాడు. ఉద్యోగం పోతుందే ఎట్లా!- అని ఎన్నడూ భయపడలేదు! ఏడాదికోసారి ఇంక్రిమెంట్ తీసుకొని తృప్తిపడేవాడు. ఈ హై రైజ్‌లు లేవు. పెద్ద మొత్తం జీతం వస్తున్నదన్న సంతోషం నాకెన్నాళ్ళున్నది! రెండేండ్లు కాలేదు ఇదిగో ఈ మార్కెట్ పడిపోతున్నదన్న బాంబు పేలింది. నా ఉద్యోగమేమౌతుందో!- హైరైజ్ మాట అటుంచి నా ఉద్యోగం నిలిస్తే చాలు. క్వాలిటీలో ఏం జరిగిందో ఈ మార్కెటింగువాళ్ళు సర్వే చేస్తేగాని తెలదు-" అని అగర్వాల్ గుండె దడదడలాడింది.

కాల్‌మాల్‌ను ప్రయోగశాలలో పరీక్షించారు క్షణాల మీద. కాల్‌మాల్‌లో ఎవరో ఆసిడ్ లాంటి పదార్థాన్ని కలుపుతున్నారని తేలింది. క్షణాల్లో క్వాలిటీ సెక్షన్‌లోనే పని చేస్తున్న మిస్టర్ గుండూరామ్‌ను పట్టుకున్నారు. ఆ పదార్థాన్ని కలుపుతున్నది నిజమే! గోల్‌మాల్ కంపెనీ కొత్తగా ఇండియన్ మార్కెట్‌లోకి ప్రవేశించింది. తమ టూత్‌పేస్ట్ 'గోల్‌మాల్'ను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టారు. "కాల్‌మాల్" మార్కెట్‌ను పడగొట్టాలని ఎత్తు వేసారు. వాళ్ళు వేసిన ఎత్తుగడలో మిస్టర్ గుండూరామ్ పడిపోయాడు.



కొత్తగా రోజువారీ వేతనం మీద కొంతమంది ఎమ్‌బిఏ చదివే యువతీయువకులను రిక్రూట్ చేసారు మార్కెటింగువాళ్ళు. వాడవాడకు వీధివీధికి ఇంటింటికి పోయి వాళ్ళ ప్రతిఒక్కరి అభిప్రాయమడిగారు. అందరు చెప్పిందాన్నిబట్టి తేలిందేమిటంటె కాల్‌మాల్ మునుపటిలా లేదు. "పండ్లు తోముకోగానే నోరంతా తిమ్మిరెక్కినట్లవుతున్నది. పండ్లు మునుపటిలా తెల్లగా వుంటున్నాయి! పేస్ట్ నురుగు బాగానే వస్తుంది! కాని నోరంతా పగులుతున్నది ఏది తిన్నా రుచి వుండటం లేదు!"- అని ప్రజాభిప్రాయ సేకరణలో బయటపడింది.

క్వాలిటీ సెక్షన్ హెడ్ అగర్వాల్‌కు పిలుపు వచ్చింది ఎమ్‌డి సుందరం దగ్గర నుంచి. అగర్వాల్ కాళ్ళు గజగజ వణికాయి.

"మిస్టర్ అగర్వాల్ దీనిక్కారణమేమిటో చెప్పండి!" గద్దించాడు ఎమ్‌డి.

కాల్‌మాల్‌ను ప్రయోగశాలలో పరీక్షించారు క్షణాల మీద. కాల్‌మాల్‌లో ఎవరో ఆసిడ్ లాంటి పదార్థాన్ని కలుపుతున్నారని తేలింది. క్షణాల్లో క్వాలిటీ సెక్షన్‌లోనే పని చేస్తున్న మిస్టర్ గుండూరామ్‌ను పట్టుకున్నారు. ఆ పదార్థాన్ని కలుపుతున్నది నిజమే! గోల్‌మాల్ కంపెనీ కొత్తగా ఇండియన్ మార్కెట్‌లోకి ప్రవేశించింది. తమ టూత్‌పేస్ట్ 'గోల్‌మాల్'ను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టారు. "కాల్‌మాల్" మార్కెట్‌ను పడగొట్టాలని ఎత్తు వేసారు. వాళ్ళు వేసిన ఎత్తుగడలో మిస్టర్ గుండూరామ్ పడిపోయాడు. డబ్బుకు గోల్‌మాల్‌లో జీఎం పోస్టు దొరుకుతుందన్న ఆశకు లొంగిపోయాడు. కాల్‌మాల్‌ను కల్తీ చేయటానికి అంగీకరించాడు. విదేశీ కంపెనీ గోల్‌మాల్ కుట్రలో కాల్‌మాల్ మార్కెట్ కూలిపోయింది. ఒకప్పుడు మార్కెట్‌ను షేర్‌బజారును శాసించిన కాల్‌మాల్ ఎందుకు పనికిరానిదయింది. గోల్‌మాల్ దాని స్థానాన్ని అందుకుంది. మార్కెట్‌లో నెంబర్ వన్ పేస్టుగా కొనుగోలును సంపాదించుకుంది. మళ్ళా ఎంత ప్రయత్నించినా కాల్‌మాల్ మునుపటి మార్కెట్‌ను పట్టుకోలేకపోయింది. అందాల తారల ప్రకటనలు కూడా వాళ్ళ అమ్మకాలను పెంచలేకపోయాయి. కాల్‌మాల్ గోల్‌మాల్ పేస్టును దెబ్బ తీయలేకపోయింది. కొన్నాళ్ళకు మిస్టర్ గుండూరామ్ గోల్‌మాల్ కంపెనీలో జీఎంగా చేరాడు.

●

## రచయితలకు సూచనలు!

* మీ రచనలను కాగితాలకు ఒకవైపున మాత్రమే రాయాలి.
* జిరాక్స్ కాపీలను పరిశీలనకు స్వీకరించలేం.
* మీ రచనతోపాటు పూర్తి అడ్రసు రాయాలి. పిన్‌కోడ్ నెంబరు తప్పనిసరిగా ఉండాలి.
* అనువాద రచనలకి మూల రచయిత అనుమతి పత్రం జతచేయాలి.
* మీ రచన ఇదివరకు ఎప్పుడూ, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదన్న హామీపత్రం జతపరచాలి.
* ప్రచురించని రచనల్ని తిరిగి పొందాలనుకునేవారు తగినంత పోస్టేజీ స్టాంపులు అంటించిన సెల్ఫ్ అడ్రసు కవరు విధిగా జతపరచాలి.
* రచనల ప్రచురణకు సంబంధించి ఫోన్‌లో ఎలాంటి సంప్రదింపులకు తావులేదు.
* ఆరోగ్యకరమయిన హాస్య, వ్యంగ్య రచనలకి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది.

మీ రచనలు పంపించవలసిన చిరునామా:

ఆదివారం వార్త,
ఎడిటర్
'వార్త' తెలుగు దినపత్రిక,
లోయర్ ట్యాంక్‌బండ్,
హైదరాబాద్- 500 080